క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఏన్కూరు: మండలంలోని నాచారం శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కొలువు దీరిని పద్మావతి అమ్మవారి 23వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మేలుకొలుపు, సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, మంగళాశాసనం, రక్షాబంధనం, కలశ ఆవాహసనము, హోమంగుండ పూజలు నిర్వహించి అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్ శేషయ్య, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలంలోని ముత్తారంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పునర్వసు నక్షత్ర శాంతి కల్యాణం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు బొర్రా వాసుదేవాచార్యులు, శిష్య బృందంచే గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెంకట నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ జీవన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయినాధుడికి..

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో బాబాకి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయి నిలయంలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

మధిర: మధిరలోని శ్రీ దివ్య షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈమేరకు మొక్కపాటి గోపీచంద్, ఎస్‌వైఎస్.భట్టాచార్య, నున్న ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేయగా ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు ఆలయ కోశాధికారి కురువెళ్ల వెంకటపురుషోత్తంతో పాటు చల్లగుండ్ల సత్యవతి, చిన్న కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, ఆచార్యులు పాల్గొన్నారు.

బుగ్గవాగును పరిశీలించిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

కారేపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెరుగుతున్న మండలంలోని పేరుపల్లివద్ద ప్రవహిస్తున్న బుగ్గవాగు ఉధృతిని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుగ్గవాగు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున సమీపంలోని డబుల్‌బెడ్‌రూం వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శిగా బాలస్వామి

మధిర: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కార్యవర్గాన్ని గురువారం వైరాలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధిరకు చెందిన పాగి బాలస్వామి జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆయనను పలువురు జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

అందని 'మధ్యాహ్న' బిల్లులు


భోజనం వండుతున్న కార్మికులు

- నిలిచిన మూడు నెలల బిల్లులు.. ఒక నెల వేతనం
- కోడిగుడ్లపై నెలకు రూ.17వేలు నష్టం
- వంట మానేస్తామంటున్న కార్మికులు

ఏన్కూరు: పుస్తెలు తాడు తాకట్టు అప్పులు తీసుకువచ్చి మరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతుంటే.. ప్రభుత్వం మాత్రం సకాలంలో బిల్లులు చెల్లించకుండా మధ్యాహ్న వర్కర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. దీంతో సహనం నశించిన కార్మికులు.. అప్పులు చేసి మరీ భోజనం పెట్టడం కంటే పని మానుకోవడం మేలని మధ్యాహ్న వర్కర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

ప్రతీ నెల ఖర్చు రూ. 1.70 లక్షలు..

మండలంలో 51 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా.. 1,446 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి భోజనాలు వండేందుకు గానూ 73మంది మధ్యాహ్న వర్కర్లు ఉన్నారు. వీరందరికీ ప్రతీ నెల బిల్లు రూ. 1.70లక్షలు వస్తుంది. ఈ ప్రకారం మార్చి, ఏప్రిల్, జూన్ నెలల బిల్లులు సుమారు రూ.5లక్షల 10వేలు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా వర్కర్లకు ప్రతి నెల రూ.2వేల వేతనం చెల్లించాలి.. అంటే జూన్ నెల వేతనం రూ.2లక్షల 19వేలు రావాల్సి ఉంది.

అవస్థలు పడుతున్న కార్మికులు..

ఇటు వేతనాలు, అటు బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు పడుతున్నారు. నిత్యావసర ధరలైతే పెరిగాయి కానీ.. బిల్లులు మాత్రం పెరగక పోవడంతో వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఒక్కో విద్యార్థికి వారానికి 3 గుడ్లు చొప్పున నెలకు 12 గుడ్లు పెట్టాలి. మార్కెట్లో గుడ్డు ధర రూ.7 ఉండగా.. ప్రభుత్వం వర్కర్లకు రూ.6 చెల్లిస్తుంది. ఇలా మండల వ్యాప్తంగా మొత్తం విద్యార్థుల మీద నెలకు రూ.17వేల 352 నష్టం వస్తుంది. అదే ఏడాదిలో అయితే పాఠశాలల సెలవు దినాలు తీసినా.. రూ.లక్ష 50వేలు వరకు నష్టం వస్తుంది. ఇకనైనా బిల్లులు వస్తాయన్న ఆశతో అప్పులు తెచ్చి మరీ భోజనం పెడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం గుడ్డు ధర పెంచాలని, లేనిచో నిత్యావసరాలు అందించాలని కోరారు.

అప్పులు పాలయ్యాం..



3 నెలల నుంచి బిల్లులు రాక పోవడంతో పాటు ఒకనెల వేతనం కూడా ఇవ్వలేదు. దీంతో విద్యార్థులకు భోజనం పెట్టేందుకు నా తాళిబొట్టు తాకట్టు పెట్టి మరీ మధ్యాహ్న భోజనాన్ని వెళ్లదీయాల్సి వస్తుంది. అప్పుల పాలయ్యాం. కిరాణం, కురగాయాల వ్యాపారులు అప్పు ఇవ్వడం లేదు. గుడ్ల మీద నష్టమే. ఈ ఇబ్బందులు పడడం కంటే పని మానుకోవడమే మంచిది. ఇకనైనా ప్రతి నెల బిల్లులు చెల్లిస్తే మా ఇబ్బందులు తొలుగుతాయి.
– రాజిన్ని వీరమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు

రూ.26లక్షలకు పైగా పెండింగ్

కల్లూరురూరల్: మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు సుమారు రూ.26 లక్షలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. కల్లూరు మండలంలో 155వంట ఏజెన్సీ కార్మికులు పని చేస్తున్నారు. 66 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలతో పాటు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు రాకపోయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


విద్యార్థులకు భోజనం పెడుతున్న కార్మికులు

విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ధ్యేయం


డిజిటల్ ల్యాబ్‌లో బోధనను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

కారేపల్లి: విద్యార్థులు అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించేలా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా తెలిపారు. కారేపల్లి మోడల్ స్కూల్, కళాశాలను ఆమె విద్యాశాఖ సంచాలకుల ఈ.నవీన్ నికోలస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజలతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో లైబ్రరీని పరిశీలించగా అవసరమైన పుస్తకాలు తెప్పించి విద్యార్థులకు పఠనాసక్తి పెంపొందించాలని సూచించారు. ఆతర్వాత అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచడమే కాక చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే, డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులను సామర్థ్యాలను పరీక్షించిన యోగితారాణా ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు. విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రాజీవ్, ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, జేడీఎస్ మదన్‌మోహన్, సమగ్ర శిక్షా జేడీ వెంకటనర్సమ్మ, కేజీబీవీ రాష్ట్ర కోఆర్డినేటర్ హెచ్.హరీష్, మోడల్ స్కూళ్ల రాష్ట్ర ఏఎంఓ మంజరి, స్టేట్ జీసీడీఓ శిరీష, ఈడబ్ల్యూడీసీ షఫీమియా, డీఈఓ సత్యనారాయణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈఓ జయరాజ్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, కేజీబీవీ ఎస్ఓ ఝాన్సీ సౌజన్యతో పాటు జి.సురేష్, ప్రాంజలి పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పెంచాలి

ఏన్కూరు: విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ తెలిపారు. గురువారం స్థానిక గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాలను, డార్మెంటరీ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి.. పదో తరగతి, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రహీంబీ, ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ వేము రాజు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీహెచ్ రమణకుమార్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


కల్లూరురూరల్: తహసీల్దార్ పులి సాంబశివుడికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

మధిర/ కల్లూరురూరల్/ ఏన్కూరు/ చింతకాని/ ముదిగొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మధిర తహసీల్దార్ రాంబాబుకు, కల్లూరు, చింతకాని, ముదిగొండ తహసీల్దార్లు పులి సాంబశివుడు, కరుణాకర్‌రెడ్డి, సునీత ఎల్జిబెత్, ఏన్కూరు తహసీల్‌లో సిబ్బందికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా టీజీటీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ.. విద్య, ఉపాధ్యాయ రంగాల్లో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించటంలో తాత్సారం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను నెలఖారులోగా పూర్తి చేయాలని, పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈవిషయమై ఆగస్టు 1న ఖమ్మంలో, ఆగస్టు 23వ తేదీన హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు షేక్ నాగూర్ వలీ, తాళ్లూరి సుబ్బారావు, వై.కోటారెడ్డి, ఏ.వినోదరావు, బండారు నాగరాజు, ఈ.వీరయ్య శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు, పూనాటి వెంకటేశ్వరరావు, రాంబాబు, జలీల్ పాషా, పుల్లయ్య, వెంకటప్పయ్య, శ్రీదేవి, లావణ్య, శంకర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శులు రాంబాబు, ఎస్‌కె జహీర్, మల్లా, మున్వర్, కిషన్, యూపీసీయూఎస్సీ నాయకులు రాయల నాగేశ్వరరావు, కె.విజయ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, పి.రాము, బి.సోమల నాయక్, బి.శ్రీనివాస్, లక్ష్మినారాయణ, శ్రీనివాస రెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


కాకర్లపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతకాని: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి ఆల్తాఫ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో పలువురికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. వారం రోజులకు పైబడి జ్వరం, ఎడతెరపిలేకుండా దగ్గు రావటం, మూడో వంతు బరువు తగ్గటం, చెమటలు పట్టడం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు కల్గిన వారికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు డాక్టర్ తబ్సుమ్, సీహెచ్ఓ వీరేందర్, ఎస్‌టీఎస్ షేక్ ఇమామ్, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరావు, ఏఎన్ఎం జయమ్మ, జీపీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

కాకర్లపల్లి ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి ఎస్సీ కాలనీలో గురువారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఎన్‌సీడీ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారారాణి, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు రాధా, జయమ్మ, ఉదయశ్రీ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..


వైరాలో ఏడీఏ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: ఖరీఫ్ సీజన్‌లో సహకార సంఘాల ద్వారా రైతులకు నెలకు ఒక్కసారే యూరియా ఇస్తామనడం సరికాదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం వైరాలోని ఏడీఏకు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎరువుల సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చలపతిరావు, రామారావు, మహిళా రైతు సంఘం జిల్లా కోకన్వీనర్ సమత, రామకృష్ణ, శ్రీనివాసరావు, మల్లిఖార్జున్, కృష్ణ, పాషా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

కల్లూరు: రైతులకు యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు సామినేని హనుమంతరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇప్పటి వరకు యూరియాపై ఇస్తున్న సబ్సిడీని కొనసాగించాలని, నానో యూరియాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణార్జునరావు, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ లాభాలబాట పట్టేందుకు అందరు అంకితభావంతో పని చేయాలని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం డిపోలో ఇంధన పొదుపు, అధిక ఆదాయం కోసం కృషి చేసి ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు పారితోషికాలు అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సూపర్‌వైజర్లు బాలస్వామి, ఈవీలు, ఆనందం, వెంకటయ్య, బాలరావు, విబీఓ కిన్నెర ఆనంద్, అప్పారావు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పార్టీని ఏమీ చేయలేరు'

బోనకల్: ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా బీఆర్‌ఎస్ పార్టీని మధిర నియోజకవర్గంలో ఏమీ చేయలేరని ఆ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాడు సీపీఎం ను అడ్డుపెట్టుకుని గెలిచిన కాంగ్రెస్ నేడు అదే పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లిఖార్జున్‌రావు, నాగేశ్వరరావు, కొండ, వెంకటేశ్వర్లు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలి


మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు, రైతులు

తల్లాడ: మండల కేంద్రంలో మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ.. కాంగ్రెస్ నాయకులు, రైతులు గురువారం వైరాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. అభివృద్ధి చెందుతున్న తల్లాడలో నూతన మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు, షెడ్లు, వే బ్రిడ్జీ, విద్యుత్, డ్రైనేజీ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి మార్కెట్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు రఘుపతిరెడ్డి, కిషోర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వేంసూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని చౌడవరం తండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని, కావున కార్యకర్తలు కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బాస్కర్ల వీరంరాజు, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనుల్లో వేగం పెంచండి


సత్తుపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా

సత్తుపల్లిటౌన్: లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్రు నర్సింహా అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు సకాలంలో నిర్మాణ పనులు చేపడితేనే దశల వారీగా బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. 45 రోజుల్లోగా ఇంటి పనులు చేపట్టకుంటే ప్రభుత్వం రద్దు చేస్తుందని స్పష్టం చేశారు. ఆయన వెంట వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో మెరిసిన గురుకుల బాలికలు

కొణిజర్ల: ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ఎన్‌సీసీ వరంగల్ 117 బెటాలియన్ శిక్షణ శిబిరంలో కొణిజర్ల మండలం తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఎన్‌సీసీ శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో 3 ప్రథమ బహుమతులు, 4 ద్వితీయ బహుమతులు, 3 తృతీయ బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రజిని తెలిపారు. గెలుపొందిన బాలికలకు కమాండెంట్ కల్నల్ సంజయ్ భద్ర, కల్నల్ నవీన్ యాదవ్‌ల చేతులు షీల్డులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

చింతకాని: పెడింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ.. ఈ పంచాయతీ ఆపరేటర్లు గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పర్వీన్ ఖైసర్ లకు వినతిపత్రాలు అందించారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఈ మేరకు రెండు రోజుల పాటు విధుల భహిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు సుమంత్, ప్రశాంత్, రాజు, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు యూనిఫామ్, నోట్‌బుక్స్

మధిర: మండలంలోని దెందుకూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సత్యసాయి సేవా సమితి, ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యాన యూనిఫామ్, నోటుబుక్స్ పంపిణీ చేశారు. అలాగే, మధ్యాహ్న భోజనం కోసం చిరబోయిన చిన్నసత్యం, చుంచు సత్యనారాయణ గ్యాస్ స్టౌ, సిలిండర్ అందజేశారు. హెచ్ఎం మేడిశెట్టి కృష్ణారావు, ఉపాధ్యాయులు వాణి, కేశవులు, హుస్సేన్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ వితరణ


ఎల్‌ఈడీ టీవీని అందిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన సూర్యనారాయణ.. ఆయన సతీమణి పార్వతి వర్ధంతి సందర్భంగా రూ.25 వేలు విలువ చేసే ఎల్‌ఈడీ టీవీని గురువారం అందించారు. అదే విధంగా ఏడునూతల రామకోటేశ్వరరావు దంపతులు రూ.7వేలు విలువ చేసే నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దామాల పుల్లయ్య, ఉపాధ్యాయులు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లల్లో వరదనీరు తొలగింపు

ఎర్రుపాలెం: మండలంలోని విద్యానగర్ గ్రామంలో కురిసిన వర్షాలకు పలువురి పేదల ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. కాలువలు అధ్వానంగా ఉండడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి.. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కోట వజ్రమ్మ తన సొంత ఖర్చుతో గ్రామంలోని ప్రధాన కాలువను బాగు చేయించారు. దీంతో ఆమెను గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు


రేమిడిచర్లలో విద్యుత్ స్తంభాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్త స్తంభాల ఏర్పాటును వారు.. విద్యుత్ ఏఈ జి.అనూషతో కలిసి ప్రారంభించారు. కొత్త లైన్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.28లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్, నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు, జానీబాషా, వెంకటనర్సయ్య, ఇస్మాయిల్, రాజీవ్‌గాంధీ, బాబురావు, కాంతారావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయుడు

తల్లాడ: తల్లాడ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు పున్నం పవన్‌కుమార్ తనకు బస్సులో దొరికిన సెల్‌ఫోన్‌ను గురువారం సంబంధిత వ్యక్తికి అప్పగించి మానవత్వం చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. ఏన్కూరులో ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పవన్‌కుమార్ తల్లాడ నుంచి బస్సులో వెళ్తుండగా సీటులో ఫోన్ దొరికింది. ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా వైరాకు చెందిన తాపీ మేస్త్రి జయరాజుదని తెలుసుకొని అందించగా.. బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

నివాళి..

కొణిజర్ల: మండలంలోని రామనర్సయ్యనగర్‌కు చెందిన సీనియర్ ఆర్ఎంపీ పఠాన్ మౌలానాఖాన్ మృతి చెందగా.. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు పాశం అప్పారావు, తడికమళ్ల సీతారాములు, గుగులోత్ సుక్కో తదితరులు నివాళులర్పించారు. ఆయన మరణం రామనర్సయ్య నగర్ ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సుభద్ర వెంకన్న, రామకృష్ణ, రాంబాబు, జ్యోతి, శ్రీను, వెంకన్న, వీరబాబు, అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ముదిగొండ: ఖమ్మంలో జరుగుతున్న దివ్యాంగుల పెన్షన్ పెంపుదలపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరౌతున్న సందర్భంగా ఖమ్మం తరలి వెళ్లారు. ముదిగొండ మండలం నుంచి దివ్యాంగులు, నాయకులు గురువారం ముదిగొండ ప్రధాన సెంటర్ నుంచి ఖమ్మం బయలు దేరివెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ బాధ్యుల నేతృత్వంలో కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచారు. ఆస్పత్రులు, వృద్ధాశ్రమాల్లో పాలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లి: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఎర్రుపాలెం: కేక్ కట్ చేస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, నాయకులు


వైరాలో..